అందుబాటులో.. ఆరోగ్య పరీక్షలు

- లావేరు, మురపాక పీహెచ్‌సీల్లో అధునాతన యంత్రాలు
- మెరుగైన సేవలందిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు
- హర్షం వ్యక్త చేస్తున్న ప్రజానీకం



లావేరు పీహెచ్‌సీ



ల్యాబ్‌ను వినియోగిస్తున్న టెక్నీషియన్



ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన నూతన పరికరాలు

ఎచ్చెర్ల: గతంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎలాంటి సదుపాయాలు లేక రోగులు ఆశించిన స్థాయిలో సేవలందించలేకపోయేవి. చిన్న, చిన్న పరీక్షలకు కూడా ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వచ్చేది. దీంతో రోగులు ఆర్థికంగా, శారీరకంగా ఇబ్బందులకు లోనయ్యేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తరువాత పీహెచ్‌సీల్లోనే రూ.కోట్లు ఖరీదు చేసే పరీక్ష యంత్రాలను ఏర్పాటు చేశారు. దీంతో వేల రూపాయల ఖరీదు చేసే అన్ని పరీక్షలూ పేదలకు అందుబాటులోకి వచ్చాయి. పీహెచ్‌సీల్లోనే పరీక్షలు, వైద్యసేవలు, మందులు ఉచితంగా అందజేస్తుండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేట్ స్థాయి వైద్యం..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. చక్కటి సేవలు, నాణ్యమైన మందులతో కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతుంది. ఒకప్పుడు వీటి వైపు కూడా చూడని వారు కూడా ఇప్పుడు గవర్నమెంట్ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. లావేరు మండల కేంద్రంలో రూ.1.77 కోట్లతో నూతన ఆస్పత్రి భవనాన్ని నిర్మించారు. లక్షలాది రూపాయలు వెచ్చించి అధునాతన పరీక్ష యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. గతంలో ఈసీజీ, డెంగీ, మలేరియా, జ్వరాలతో పాటు ప్లేట్‌లెట్స్ కౌంట్, క్రియాటిన్ వంటి పరీక్షలను శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో రోగులపై ఆర్థికభారం పడి వారు శ్రమ పడాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఎక్స్‌రే తప్ప అన్ని రకాల రక్త, మూత్ర, డెంగీ, మలేరియా, టీబీ ఇతర పరీక్షలను అతి తక్కువ సమయంలో పీహెచ్‌సీల్లో చేసి ఉచితంగా అందజేస్తున్నారు. వీటితో పాటు బీపీ, సుగర్ పరీటలను చేస్తున్నారు. సుమారు రూ.1500 నుంచి రూ.2 వేల వరకు ప్రైవేట్ ల్యాబ్‌లలో చార్జ్ చేసే పరీక్షలను పీహెచ్‌సీల్లో ఉచితంగా చేస్తున్నారు. గత టీడీపీ హయాంలో కుక్కకాటు, పాముకాట్లకు సైతం మందులు అందుబాటులో ఉండేవికావు. వేరు, మురపాక పీహెచ్‌ల్లో ఒక్కరే ల్యాబ్ టెక్నీషియన్ ఉండేవారు. కానీ ఇప్పుడు రెండు చోట్లా ల్యాబ్ టెక్నీషియన్లు అందుబాటులో ఉన్నారు. ఈ పీహెచ్‌సీల ద్వారా సుమారు లక్ష మంది ప్రజలకు వైద్య సేవలందుతున్నాయి. ఈ పీహెచ్‌సీల్లో ఇద్దరేసి వైద్యులు ఉన్నారు. అన్ని రకాల మందులు పుష్కలంగా ఉన్నాయి.



ఆస్పత్రిల్లో ఏర్పాటు చేసిన మందుల షాపు



ఆస్పత్రి ఆవరణలో ఏర్పాట్లు



రక్త నమూనాలను సేకరిస్తున్న సిబ్బంది

రోగులకు ఎంతో మేలు



గతంలో పీహెచ్‌సీల్లో అరకొర మందులు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించేవారు. లావేరు, మురపాక పీహెచ్‌సీల్లో గతంలో ఒక్కరే ల్యాబ్ టెక్నీషియన్ ఉండటం వల్ల పరీక్షలు ఆలస్యమయ్యేవి. ఇప్పుడు రెండు చోట్లా ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు, వైద్యులు అందుబాటులో ఉన్నారు. ల్యాబ్‌లోనే అన్ని పరీక్షలు సకాలంలో చేస్తున్నారు.

– మజ్జి అప్పలనాయుడు, మురపాక

త్వరితగతిన పరీక్షలు



ప్రభుత్వం పీహెచ్‌సీలకు అధునాతన పరీక్ష యంత్రాలను సరఫరా చేసింది. తక్కువ సమయంలో ఎక్కువ మందికి పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఈసీజీ, డెంగీ, మలేరియా, ఇతర పరీక్షలు గతంలో అందుబాటులో ఉండేవికాదు. చాలా వరకు ఇప్పుడు పీహెచ్‌సీ ల్యాబ్‌లలోనే పరీక్షలు చేసి ఫలితాలు ఇచ్చే అవకాశం అందుబాటులోకి వచ్చింది.

-పి.సూర్యకుమారి, ల్యాబ్‌టెక్నీషియన్, లావేరు

రోగులపై ఆర్థికభారం ఉండదు



పీహెచ్‌సీల్లో పలు రకాల ఆరోగ్య పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. ప్రైవేట్ ల్యాబ్‌లలో పరీక్షలు చేయించుకోవడమంటే రోగులపై ఆర్థికబారం పడినట్లే. ఇప్పుడు ఈ సమస్య లేదు. పరీక్షలు, వైద్య సేవలు, మందులన్నీ పుష్కలంగా అందుబాటులోకి వచ్చాయి. ప్రజలు పీహెచ్‌సీల సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

-జి.మౌనిక, వైద్యురాలు, లావేరు పీహెచ్‌సీ

క్లుప్తంగా

డోలోత్సవంలో ప్రసాదం పంపిణీ



భక్తులకు పులిహోర పంపిణీ చేస్తున్న దృశ్యం

గార: శ్రీకూర్మనాథుని డోలోత్సవం సందర్భంగా శ్రీకూర్మంలో బరాటం నాగేశ్వరరావు పదివేల మందికి పులిహోర ప్రసాదాన్ని ఆదివారం పంపిణీ చేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన ఉయ్యాల చంటి రెండు వేల మందికి గ్లూకోజ్ ప్యాకెట్లు, ఏడువేల మందికి మజ్జిగ అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అందవరపు బాలకృష్ణమూర్తి, అనుపోజు నాగరాజు, పల్ల రాధాకృష్ణ, శ్రీనివాసరావు ఉన్నారు.

శ్రీకూర్మనాథున్ని దర్శించుకున్న జడ్జి



ఆశీర్వచనం అందజేస్తున్న అర్చకులు

గార: శ్రీకూర్మనాథున్ని జిల్లా అదనపు న్యాయమూర్తి మహేంద్ర ఫణికుమార్ సతీసమేతంగా ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. ముందుగా మూలవిరాట్ వద్ద ప్రత్యేక పూజలనంతరం లక్ష్మీసన్నిధి, వైష్ణవీదుర్గలను దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు క్షేత్రమహాత్యాన్ని తెలియజేసి, తీర్థ ప్రసాదాన్ని అందజేశారు.

భజనలపై శిక్షణ



మాట్లాడుతున్న రాష్ట్ర ఇన్‌చార్జి శ్రీనివాస్

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని సత్యసాయి భజన మండలి మందిరంలో సత్యసాయి మందిరాల్లో నిర్వహించే భజనపై శిక్షణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర భజన్ల ఇన్‌చార్జి జి.శ్రీనివాస్ భజనలో తీసుకోవలసిన జాగ్రత్తలు, విధి విధానాలు వివరించారు. జిల్లా అధ్యక్షులు వై.లింగరాజు మాట్లాడుతూ.. భక్తితో భజనలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇన్‌చార్జి పి.గంగాధర్, అరుణ, సుధారాణి, పూర్వపు జిల్లా అధ్యక్షులు గంగుల రమణబాబు, జిల్లా సేవాదళ్ సమన్వయకర్త సూర రామచంద్రరావు, ఆధ్యాత్మిక సమన్వయకర్త అనాధ గుప్త, జోనల కన్వీనర్ పప్పల నాగేశ్వరరావు, మందిరం కన్వీనర్ భాస్కరరావు, జిల్లా పదాధికారులు పాల్గొన్నారు.

రాజమ్మతల్లి దర్శనానికి పోటెత్తిన భక్తులు



భక్తులకు దర్శనమిస్తున్న రాజమ్మ తల్లి

గార: వత్సవలసలో కొలువున్న రాజమ్మ తల్లి (రాజరాజేశ్వరి) దర్శనానికి భక్తులు చివరి వారం ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. శనివారం రాత్రికి వచ్చిన భక్తులు బసచేసి రాజరాజేశ్వరి (రాజమ్మతల్లి) పాటు భూలోకమ్మ తల్లికి ఆదివారం ఉదయం మొక్కులు తీర్చుకున్నారు. వేకువజామున సమీపంలోని సముద్రంలో స్నానాలు ఆచరించారు. కుటుంబ సమేతంగా విచ్చేసి ఇక్కడే వంటలు చేసుకొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అదేవిదంగా భూలోకమ్మను దర్శించుకున్నారు. ఉత్సవంలో కోళ్లు, గొర్రెలు సమర్పించడంతో పాటు కానుకలు అధికంగా భక్తులు ముట్టజెప్పారు. వన్‌వే ట్రాఫిక్‌ను పోలీసులు అమలు చేయడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పాయి. వన్‌టౌన్ సీఐ ఎల్.సన్యాసినాయుడు, ఎస్సై కె.కృష్ణప్రసాద్‌లు బందోబస్తు పర్యవేక్షించారు.

చదవడం మాకిష్టం



బహుమతులతో విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కథలు పుస్తకాలు చదించారు. వేమన, సుమతీ శతకాల్లోని పద్యాలపై పోటీలు నిర్వహించారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా బహుమతులు అందజేశారు. సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ మలిపెద్ది చంద్రశేఖర్ తెలిపారు. విజ్ఞానానికి గ్రంథాలయం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

తంగివానిపేట రోడ్డుకు మహర్దశ



పూర్తయిన రోడ్డు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని పెదపాడు మీదుగా తంగివానిపేట గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా ఉండేది. గడిచిన ప్రభుత్వ కనీసం పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. సమస్యను పరిష్కరించాలని పలు మార్లు అధికారులకు విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేదు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవతో ఈ రోడ్డు అభివృద్ధి కోసం సాధారణ నిధుల నుంచి రూ. పది లక్షలు మంజూరు చేశారు. పనులు కూడా పూర్తి కావడంతో ఈ ప్రాంతీయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి ధర్మాన పరామర్శ



పరామర్శలో మంత్రి ధర్మాన తదితరులు

శ్రీకాకుళం రూరల్: మంత్రి ధర్మాన ప్రసాదరావు వ్యక్తిగత డ్రైవర్ అనిల్ మేనల్లుడు బబ్బోది హరినారాయణ ఆకాశ్ చెన్నైలో ఇటీవల మరణించారు. దీంతో నైరా గ్రామంలో ఉంటున్న అనిల్‌ను మంత్రి ధర్మాన ఆదివారం పరామర్శించారు. పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

ఏపీఎన్జీవో నాయకుడికి సత్కారం



పురుషోత్తమనాయుడుతో న్యాయవాదులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన చౌదరి పురుషోత్తమనాయుడును శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం సత్కరించారు. ఉద్యోగుల సమస్యలపై పురుషోత్తమనాయుడు పోరాటం చేస్తున్నారని కొనియాడారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, ఏపీ బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఆగూరు ఉమామహేశ్వరరావు, ఏపీ బీసీ న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి, జై భారత్ నేషనల్ పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ చౌదరి లక్ష్మణరావు, న్యాయవాదులు బీవీ రమణ, పైడి జోగారావు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో చక్రతీర్థ స్నానాలు



విగ్రహాలకు చక్రతీర్థ స్నానాలు చేస్తున్న భక్తులు

కొత్తూరు: మండలంలోని గూనభద్ర గ్రామంలోని రాధాకాంతస్వామి ఆలయం వద్ద డోలోత్సవం వేడుకలు గత మూడు రోజులు నుంచి ఘనంగా జరుగుతున్నాయి. చివరరోజు ఆదివారం వసంత ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాధాకాంత స్వామి ఉత్సవ విగ్రహాలకు తీరువీధి చేపట్టారు. అనంతరం స్థానిక వంశధార రిజర్వాయర్ వద్ద చక్రతీర్థ స్నానాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

విద్యార్థుల్లో సేవాదృక్పథం అవసరం



మాట్లాడుతున్న డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల్లో సేవాదృక్పథం అవసరమని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎంపురం క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ అన్నారు. వారం రోజులు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరాన్ని ఎచ్చెర్ల, ఎస్ఎంపురం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక క్యాంపస్‌లో ప్రత్యేక శిబిరం ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. డైరెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లోనూ ముందుండాలన్నారు. గ్రామాల్లో ప్రత్యేక శిబిరాల నిర్వహిణ వల్ల విద్యార్థులు నేరుగా గ్రామాల్లో ప్రగతి, సమస్యలు తెలుసుకుంటారన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, పచ్చదనం, అక్షరాస్యత వంటి అంశాల్లో చైతన్యం కల్పించడం అవసరమన్నారు. వైద్యాధికారి అరుణ, ఏఓ రామకృష్ణ, ఓఎస్డీ సుధాకర్‌బాబు, డీన్ మోహనకృష్ణ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



పైడిభీమవరం చెక్ పోస్టు వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్వో లక్ష్మణమూర్తి

రణస్థలం:

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా అంతర్ చెక్ పోస్టుల వద్ద పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎచ్చెర్ల నియోజకవర్గ ఎన్నికల ఆర్వో లక్ష్మణమూర్తి సూచించారు. రణస్థలం మండలంలోని పైడిభీమవరం, లావేరు మండలంలోని వెంకటాపురం అంతర్ జిల్లాల చెక్ పోస్టులను ఆదివారం తనిఖీ చేశారు. జిల్లాలోనికి ప్రవేశించే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే అనుమతిస్తున్నారు. సరైన పత్రాలు లేకుండా ఎటువంటి వస్తువులు, మద్యం వంటివి అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నగదు రూ.50వేలకు మించి తీసుకువస్తే పక్కా ఆధారాలు ఉండాలన్నారు. రావాడలో ఫ్లయింగ్ స్క్వాడ్ విధులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం



మాట్లాడుతున్న శ్రీరామ్మూర్తి

జి.సిగడాం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా గొర్లె కిరణ్‌కుమార్ అత్యధిక మెజార్టీతో విజయమే లక్ష్యంగా పనిచేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుగా ఇస్తామని పార్టీ మండల ఉపాధ్యక్షుడు పేడాడ శ్రీరామ్మూర్తి అన్నారు. మండలంలోని అబోతులపేట, ఆనందపురం గ్రామాల్లో ఆదివారం ప్రచారం చేశారు. అనంతరం గ్రామ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ సూచనల మేరకు అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రజలకు సీఎం జగన్ అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. సర్పంచ్‌లు చిత్తిరి మోహన్, బుడారి లక్ష్మణరావు కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



క్రిస్టియన్ వర్‌షిప్ సెంటర్‌లో మట్టల ప్రదర్శన



తెలుగు బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో ర్యాలీ



ట్రినిటీ చర్చి ఆధ్వర్యంలో ర్యాలీ



అప్పర్ రూం చర్చి ఆధ్వర్యంలో..

శ్రీకాకుళం కల్చరల్: మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఏసు ప్రభువును శిలువ చేసిన గుడ్‌ఫ్రైడే ముందు వచ్చే ఆదివారం దీన్ని జరుపుకోవడం ఆనవాయితీ. శ్రీకాకుళం చిన్న బజారులోని తెలుగు బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. లోకరక్షకుడైన ఏసుక్రీస్తు శిలువ చేయడంపై చర్చి పాదర్ సందేశాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ పాస్టర్ కె.జెస్ ప్రేమ్‌కుమార్, డీఎల్‌బీఎల్ కుమార్, వై.జీవన్, వై.సునీల్, ఎల్.చిట్టిబాబు, పాల్ పాల్గొన్నారు. అలాగే కీస్టోన్ చర్చిలో పాస్టర్ జోయల్ ఆధ్వర్యంలో ఈత ఆకులతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహిళా కళాశాల రోడ్డులోని క్రిస్టియన్ వర్‌షిప్ సెంటర్ ఆధ్వర్యంలో కూడా ఈత ఆకుల ప్రదర్శన, ప్రార్థనలు జరిగాయి. జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న ట్రినిటీ బాప్టిస్టు చర్చిలో పాస్టర్ జాకబ్ అధికారి ఆధ్వర్యంలో క్రైస్తవ సోదరులు ఈత ఆకులతో ర్యాలీ నిర్వహించారు. అఫీషియల్‌కాలనీలో ఉన్న సీఎస్ఐ చర్చిలో మట్టల ఆదివారం సందర్భంగా ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో చర్చి పాదర్ ప్రభాకర్ ఉన్నారు. పాత శ్రీకాకుళంలోని ఆంధ్రా బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో పాస్టర్ డాక్టర్ రెవరెండ్ లోపింటి ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. హౌసింగ్ బోర్డు కాలనీలోని అప్పర్ రూం చర్చి పాస్టర్ కె.సుజ్ఞానరావు, కె.వెస్లీ సుజ్ఞాన్ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ఆరాధన గీతాలను ఆలపించారు.

వైఎస్సార్‌సీపీలోకి నూతన ఓటర్లు



ధర్మాన సమక్షంలో పార్టీలో చేరిన యువకులు

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం నగరానికి చెంది.. కొత్తగా ఓటుహక్కు పొందిన 20 మంది యువకులు పాలిశెట్టి దామెదర్‌రాజా ఆధ్వర్యంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వీరికి మంత్రి ధర్మాన కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శిమ్మ రాజశేఖర్, పాలిశెట్టి మధుబాబు, కాపవరపు సీజు ఉన్నారు.

దేవతా విగ్రహాల ప్రతిష్ట



విగ్రహాల ప్రతిష్ట నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: బలగ సత్యసాయినగర్‌లో లలితాదేవి, సమేత శివకామేశ్వర, మహాగణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉప దేవాలయాల ప్రతిష్టా మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ఉల్లాసం కలుగుతోందన్నారు. నేటి కంప్యూటర్ యుగంలో దైవచింతన కోసం సమయం కేటాయించలేకపోతున్నారని అన్నారు. ఇటువంటి తరుణంలో ఆలయాల నిర్మాణం, పూజలు, సేవా కార్యక్రమాలతో కొందరిలోనైనా ఈ భావాలు అలవడతాయన్నారు. ప్రతిష్టా ఉత్సవం సందర్భంగా విగ్రహాలకు ప్రాణప్రతిష్ట, కల్యాన్యాసం, దర్పణ దర్శనం, మహాపూర్ణాహుతి, సర్వదర్శనం , మహా కుంభాభిషేకం, శివకల్యాణం, నీరాజ మంత్రపుష్పం వేదస్వస్తి, ప్రసాద వితరణ జరిగింది. అర్చకులు రంప శ్రీనివాసరావు, బంకుపల్లి శాస్త్రిశర్మ, బంకుపల్లిసతీష్ శర్మ, నేతింటి సాయి శర్మ తదితరులున్నారు.